సాక్షి నల్లగొండ

శుక్రవారం, 21, ఏప్రిల్, 2023



విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలోని రేషన్ షాపుల్లో గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేశారు. - 8లో




ప్రతిపక్షాలు ఏకమవ్వాలి

బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 41°/27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.







ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు, ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు

మత సామరస్యానికి పెద్దపీట

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత సామరస్యానికి పెద్దపీట వేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఉన్న మదీనా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను అధికారికంగా జరపడం సీఎం కేసీఆర్ ఔదార్యానికి నిదర్శనమన్నారు. సర్వ మతాల విశ్వాసాలను పరిరక్షించడంలో కేసీఆర్‌కు ఎవరూ సాటి రారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని, అందుకు కారణం అన్ని వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేయడమే కాకుండా అన్ని మతాల పండుగలకు సమ ప్రాధాన్యం ఇవ్వడమే అన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చీర పంకజ్‌యాదవ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చిరుమర్తి



ఎమ్మెల్యే చిరుమర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నకిరేకల్: నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్, అంతకుముందు మంత్రి హరీశ్ రావును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (రామంతాపూర్), బేగంపేట స్కూల్‌లో 2023–24విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి డే స్కాలర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 29లోపు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు ఫోన్ 08682–295715, 9515181080 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధ్యతగా పనిచేయాలి



రికార్డు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మిర్యాలగూడ: సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. మండలంలోని తడకమళ్ల గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వేములపల్లి: వచ్చే వర్షాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అన్నారు. గురువారం మండలంలోని బుగ్గబావిగూడెం, వేములపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ అజ్మీరాదేవిక, సర్పంచ్ అనిరెడ్డి నాగలక్ష్మి, ఎంపీఓ సంగీత, ఏపీఓ మిరాజుద్దీన్ ఉన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కోడి శ్రీనివాసులు

చండూరు: ఈనెల 26న నల్లగొండలో నిర్వహించే విద్యా సదస్సు, విద్యా సేవారత్న అవార్డుల ప్రధానోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు కోరారు. గురువారం చండూరులో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.రావు, కోశాధికారి మట్ట చెన్నయ్యగౌడ్, నలగొండ పట్టణ అధ్యక్షుడు ఎండీ.అజీజ్, గంట్ల అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్, శ్రీధర్‌బాబు, చంద్రశేఖర్, నరసింహ, తిరుమల్‌రెడ్డి, భిక్షం పాల్గొన్నారు.

కుదిరిన సయోధ్య!

- మాట నెగ్గించుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మధ్యవర్తిత్వం వహించిన ఏఐసీసీ పెద్దలు
- 28న నల్లగొండ ఎంజీయూలో నిరుద్యోగ ఉద్యమ సభ



సాక్షి ప్రతినిధి నల్లగొండ: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిరుద్యోగ ఉద్యమ సభ విషయంలో సయోధ్య కుదిరింది. సభ నిర్వహణపై జిల్లా నేతలకు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మధ్య మొదలైన వివాదం సద్దుమనిగింది. ఏఐసీసీ పెద్దలు జోక్యం చేసుకొని మాజీ పీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మాట్లాడి సయోధ్య కుదిర్చారు. దీంతో ఈ నెల 28వ తేదీన మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది.

దిగొచ్చిన అధిష్టానం

జిల్లా నేతలతో సంప్రదింపులు జరుపకుండా, నల్లగొండ ఎంపీ అయిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించకుండా, ఆయన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈనెల 21వ తేదీన నిరుద్యోగ ఉద్యమం ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీరియస్ అయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేకు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు లేఖ రాశారు. తనను సంప్రదించకుండా ఏకపక్షంగా టీపీసీసీ అధ్యక్షుడు సభను ప్రకటించడం ఏమిటని మండిపడ్డారు. తమకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా సభ నిర్వహిస్తామని ప్రకటించడం తనను అవమానించడమేనని, పైగా రేవంత్‌రెడ్డి నియోజకవర్గం, జిల్లాలో పార్టీ పరిస్థితి దారుణంగా ఉందని, అక్కడ పట్టించుకోకుండా, ఇక్కడ చేయి పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ షా, మాణిక్‌రావు ఠాక్రేలు చొరవ తీసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈనెల 21వ తేదీన నిర్వహించాల్సిన నిరుద్యోగ ఉద్యమ ప్రారంభ సభను వాయిదా వేయించారు. మరోవైపు రేవంత్‌రెడ్డితో, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చలు జరిపి ఇద్దరిని ఒప్పించారు. ఇక ఈనెల 28వ తేదీన మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సభ నిర్వహణకు సహకరించాలని సూచించడంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఒప్పుకున్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం నల్లగొండలో నిర్వహించాల్సిన సభను 28వ తేదీకి వాయిదా వేయగా, మిగితా జిల్లాల్లో మాత్రం షెడ్యూల్ ప్రకారం నిరుద్యోగ సభలను నిర్వహించేలా ఒప్పించారు. ఈనెల 24వ తేదీన ఖమ్మం, 26న ఆదిలాబాద్‌లో సభ నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. అలాగే 30వ తేదీన మహబూబ్‌నగర్, మే 1వ తేదీన రంగారెడ్డి జిల్లాలో సభ నిర్వహణకు ఓకే చెప్పారు. మొత్తానికి ఏఐసీసీ నేతల జోక్యంతో రేవంత్‌రెడ్డికి జిల్లా కాంగ్రెస్ నేతలకు మధ్య రాజుకున్న వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది.

రామగిరిలో చకిలం విగ్రహానికి నివాళులర్పించనున్న రేవంత్

నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈ నెల 28న నిరుద్యోగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటన విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి 28న ముందుగా రామగిరి సెంటర్‌లో ఉన్న మాజీ ఎంపీ, డీసీసీ మాజీ అధ్యక్షుడు సర్దార్ చకిలం శ్రీనివాస్‌రావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నిరుద్యోగ ఉద్యమ సభలో పాల్గొననున్నారు. ఈ సభకు పార్టీ సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఇతర నేతలు హాజరవుతారని ప్రకటించారు. అయితే సభకు ఎవరు హాజరవుతారు? ఎవరు గైర్హాజరవుతారనేది అదే రోజున తేలనుంది.

విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు

- పంపిణీకి సిద్ధమవుతున్న విద్యాశాఖ
- 24వ తేదీతో ముగియనున్న విద్యాసంవత్సరం
- అదే రోజు పాఠశాలల వారీగా కార్డుల అందజేత



నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారంతో ఎస్‌ఏ–2 (సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు ముగిశాయి. అయితే ఈ విద్యా సంవత్సరం ఈ నెల 24వ తేదీతో చివరి రోజు కావడంతో 1నుంచి 9వ తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎఫ్‌ఏ, ఎస్‌ఏ–1 పరీక్షలకు సంబంధించి విద్యార్థులు సాధించిన మార్కులను ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతోపాటు ఈ నెల 12 నుంచి 20 తేదీ వరకు జరిగిన ఎస్‌ఏ–2 పరీక్షల మార్కులను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. చివరగా ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చేందుకు రెడీ చేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డును ప్రింట్ చేసి దానిపై ఆ విద్యా సంవత్సరంలో జరిగిన పరీక్షలకు సంబంధించి అన్ని మార్కులను ఎప్పటికప్పుడు నమోదు చేసేవారు. కార్డులో విద్యార్థి వ్యక్తిగత వివరాలు, వివిధ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, వచ్చిన గ్రేడ్, హాజరుశాతం, ఇతర ఆరోగ్య సమాచారం నమోదు చేసి ఆ కార్డును ఇంటి పంపించి తల్లిదండ్రుల సంతకం తీసుకునేవారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డును ఇస్తున్నారు.

కరోనా నుంచి కార్డులు బంద్..

కరోనా కారణంగా విద్యా సంస్థలు ఏడాదిన్నర పాటు బందయ్యాయి. కొన్ని రోజుల పాటు ఆన్‌లైన్ తరగతులు పెట్టి ఆన్‌లైన్‌లోనే పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత ప్రత్యక్ష తరగతులు చేపట్టారు. కానీ, అప్పటి నుంచి ప్రింట్ చేసిన ప్రోగ్రెస్ కార్డులను నిలిపివేశారు. గత విద్యా సంవత్సరం కూడా ఆన్‌లైన్ కార్డునే ఇచ్చారు.

ముగింపు రోజే పంపిణీ..

ఈ విద్యాసంవత్సరం ముగింపు రోజైన ఈ నెల 24 నాడే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా పాఠశాలల వారీగా 1 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నిర్వహించిన పరీక్షలు ఎఫ్‌ఏ–1, 2, 3, 4 పరీక్షలతోపాటు అక్టోబర్‌లో నిర్వహించిన ఎస్‌ఏ–1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశారు. ప్రస్తుతం గురువారం ముగిసిన ఎఫ్‌ఏ–2 పరీక్షల మార్కులను కూడా నమోదు చేస్తున్నారు.

కార్డులు సిద్ధం చేస్తున్నాం..

ఈ విద్యా సంవత్సరం ఈ నెల 24వ తేదీన చివరి రోజు. ఆ రోజునే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇస్తాం. అందుకు సంబంధించి పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మార్కులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారు. ఆ తరువాత ప్రింటెడ్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేస్తాం.

– భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- చెన్నారం, కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



కొత్తపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నల్లగొండ రూరల్: రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ మండలం చెన్నారం, కొత్తపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతోపాటు నీడ వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. 121 ఐకేపీ, 114 పీఏసీఎస్‌లతో కలిపి మొత్తం 235 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 5,248 మంది రైతుల నుంచి 45,068 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని, లారీల సమస్య రాకుండా సంబంధిత కాంట్రాక్టర్ లారీలను త్వరితగతిన సమకూర్చాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు వేసేందుకు బ్యాంక్ ఖాతా, ఇతర జిరాక్స్ పత్రాలను సరిచూసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ కాళిందిని, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం సైదులు, మల్లేశ్వరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు పొందండి



మార్తినేనిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌కుమార్

- నాబార్డు ఉమ్మడి జిల్లా అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్
- మార్తినేనిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కనగల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని నాబార్డు ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి అధికారి మిర్యాల వినయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మార్తినేనిగూడెం గ్రామంలో కనగల్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,060, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద రైతులు, హమాలీల కోసం తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. సీరియల్‌ను పాటించి ధాన్యాన్ని సక్రమంగా తుకాలు వేసి వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశీలించారు. మొదటి విడత మన ఊరు– మన బడి కింద చేపట్టిన పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కాసేపు తరగతి గదిలో కూర్చొని విద్యార్థుల సామర్థ్యాలు, వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మార్తినేనిగూడెం సర్పంచ్ బండమీది రాము, బుడుమర్లపల్లి మాజీ సర్పంచ్ కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్, సీఈఓ సుధాకర్, డైరెక్టర్ పగడాల పుష్పలత రైతులు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి కూలి.. రూ.వందలోపే!

- వేసవి భత్యం లేకపోవడంతో తగ్గుతున్న రోజువారి కూలి
- ఎండలకు ఎక్కువ పనిగంటలు చేయలేని పరిస్థితి
- కూలి గిట్టుబాటు కావట్లేదని కూలీల ఆవేదన
- రోజుకు రూ.257 ఇవ్వాల్సి ఉన్నా అత్యధికంగా రూ.185 మాత్రమే..



నాంపల్లి మండలం మహ్మదాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నల్లగొండ: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదు. పథకం నిబంధనల ప్రకారం ఒక్కో కూలీకి రోజుకు సగటున రూ.257 కూలి చెల్లించాల్సి ఉన్నా రూ.వందలోపే కూలి పడుతోంది. ప్రభుత్వం వేసవి భత్యం తొలగించడంతోపాటు ఎండలతో ఎక్కువ గంటలు పని చేయలేకపోవడం కూలి తక్కువగా పడుతోంది. జిల్లాలో కొన్ని మండలాల్లో రోజుకు అత్యధికంగా రూ.185 కూలి పడుతుండగా మరికొన్ని చోట్ల కేవలం 97 రూపాయలే పడుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివిధ మండలాల్లో రోజువారి కూలి ఇలా..

నాంపల్లి మండలంలో ఉపాధి కూలీలకు రోజువారి కూలి కేవలం రూ.97 పడుతోంది. ఈ మండలంలో కూలీలకు కనీం వంద రూపాలయ కూలి కూడా రాని పరిస్థితి. పీఏపల్లిలో రూ.102, చండూరులో రూ.103, మాడ్గులపల్లిలో రూ.106, మిర్యాలగూడలో రూ.106, అనుములలో రూ.113, దామరచర్లలో రూ.118, చందంపేటలో రూ.177, నార్కట్‌పల్లిలో రూ.159, కట్టంగూర్‌లో రూ.165, పెద్దవూర మండలంలో మాత్రం అత్యధికంగా 185 రూపాయల కూలి పడుతోంది. కాగా, మిగిలిన మండలాల్లోని చాలా గ్రామాల్లో రూ.100 నుంచి రూ.150లోపే కూలీలకు రోజువారి కూలి వస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

కూలీల వివరాలు..

నమోదైన కుటుంబాలు	1.18 లక్షలు
జాబ్‌కార్డు కలిగిన కూలీలు	3.53 లక్షలు
గతేడాది కల్పించిన పనిదినాలు	1.03 కోట్లు
చేసిన పనిదినాలు	60లక్షలు

రోజూ 70 వేలమంది..

ప్రభుత్వం ఏడాదిలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని అధికారులపై ఒత్తిడి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఒక్కో గ్రామంలో రోజుకు వంద మంది కూలీలకు పనుల కల్పిస్తూ కూలీల హాజరుశాతాన్ని పెంచే విధంగా ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 70వేల మంది వరకు కూలీలు ప్రతిరోజూ ఉపాధి పనులకు వస్తున్నారు. కానీ వీరందరికీ కూలి గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధి పనులపై గ్రామీణులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

అధికారుల ఒత్తిడితోనే పనులకు..

గ్రామాల్లో ఎండ వేడిమి తక్కువగా ఉన్న ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ పనిగంటలు చేస్తుండడంతో కూలి తక్కువగా పడుతోంది. ఇదేకాక మట్టి తవ్వి రోడ్డు పోసే పనులు కష్టతరంగా ఉండడంతో కూలీలు ముందుకు రాని పరిస్థితి. అయితే వ్యవసాయ పనులు కూడా పూర్తి కావడంతో చాలా మంది ఉపాధి పనులకు వచ్చే విధంగా అధికారులు కూలీలకు నచ్చజెప్పి పనులకు తీసుకొస్తున్నారు. అధికారుల ఒత్తిడితోనే కొద్దిపాటి మంది కూలీలు రోజువారి పనులకు వస్తున్నారు.

రోజు కూలి 80 రూపాయలు మాత్రమే పడుతుంది



కాల్వలు, కోపుల్లో మట్టి తీసి రోడ్డు పోస్తున్నాం. గట్టి నేల కావడం వల్ల మట్టి తవ్వడం కష్టంగా ఉంది. ఎంత పనిచేసినా రోజుకు రూ.80 కూడా కూలి పడటం లేదు. అసలే ఎండలు పెరిగాయి. ఉదయం వచ్చి పనిచేస్తున్నాం. కూలి గిట్టుబాటు కావడం లేదు.

– నాగాటి పెంటమ్మ, ఉపాధి కూలీ, మహ్మదాపురం, నాంపల్లి మండలం

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నకిరేకల్: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. నకిరేకల్ మండలం మంగళపల్లి, తాటికల్, నోముల, నెల్లిబండ గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించి మాట్లాడారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం ప్రభాకర్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

మిర్యాలగూడ: దేశంలో ప్రజా వ్యతిరేకత పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రతిఒక్కరూ పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వాన్ని ఇక భరించకూడదని ప్రజలు స్పష్టమైన నిర్ణయానికి వచ్చారని, బీజేపీకో హఠావో దేశ్‌కీ బచావో అని దేశ వ్యాప్తంగా రణ నినాదం పదునెక్కిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీలు, ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు నానాటికి పెరిగిపోతుండడంతో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. కులాలు, మతాల మధ్య బీజేపీ ప్రభుత్వం చిచ్చు పెడుతుందన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని సర్వనాశనం చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. సమావేశంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, వినోద్‌నాయక్, పాపానాయక్, ఎర్రనాయక్, సైదులు, రమేష్, కోటిరెడ్డి, బాల సైదులు, శ్రీనునాయక్, ఖాజామొయినొద్దీన్, వెంకట్‌రెడ్డి, గోపి, మట్టారెడ్డి, విజయ్, మట్టయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహబూబ్‌నగర్ ఎస్పీకి పితృ వియోగం


కొత్తపల్లి మారయ్య (ఫైల్)

చండూరు: మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తండ్రి కొత్తపల్లి మారయ్య (75) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో తమ స్వగ్రామమైన చండూరు మండలంలోని కొండాపురంలో మృతిచెందారు. మారయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు నర్సింహ ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీగా కొనసాగుతున్నారు.

నివాళులర్పించిన నల్లగొండ ఎస్పీ, మునుగోడు ఎమ్మెల్యే..

కొత్తపల్లి మారయ్య భౌతికకాయానికి గురువారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నేరేడుచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడేనికి చెందిన మచ్చా రాము(31) హుజూర్‌నగర్‌లోని సాయిరాం మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. గురువారం తన విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో చిల్లేపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి బ్రిడ్జిపై ఉన్న పుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా


ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడడంతో రోడ్డు పాలైన ధాన్యం

మోత్కూరు: ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోగా ట్రాలీ బోల్తా పడిన సంఘటన మండలంలోని పాటిమట్ల గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన బీసు రాజు ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తుండగా పాటిమట్ల గ్రామ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. దీంతో ధాన్యం మొత్తం రోడ్డు పాలైంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

అంజయ్యది హత్యా.. ఆత్మహత్యా?

- మామిడి తోటలో మృతదేహం లభ్యం
- భూ వివాదంతోనే హతమార్చారంటున్న కుటుంబ సభ్యులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

సూర్యాపేట : తుంగతుర్తి మండలం బండరామారంలోని మామిడి తోటలో ఉరివేసుకొని మృతి చెందిన వెలుగు అంజయ్యది హత్యా లేక ఆత్మహత్యా? అనేది మిస్టరీగా మారింది. భూ వివాదంతోనే హత్య చేశారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. పోలీసులు మాత్రం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్విరాల గ్రామానికి చెందిన వెలుగు అంజయ్య 30 సంవత్సరాలుగా తుంగతుర్తిలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. కాగా మొదటి భార్య సోమలక్ష్మికి బండరామారం గ్రామ శివారులోని 696/ఇ/1, 695ఆ/1 సర్వే నంబర్లలో ఉన్న 12 ఎకరాల వ్యవసాయ భూమి రాసిచ్చాడు. సోమలక్ష్మికి పిల్లలు లేకపోవడంతో తన మరిది పిట్టల అంజయ్య పేరిట భూమి మార్పిడి చేసింది. ఈ విషయం భర్త వెలుగు అంజయ్యకు తెలియడంతో తనకు చెప్పకుండా భూమి ఎలా మార్పిడి చేశావని సోమలక్ష్మితో గొడవ పడ్డాడు. ఆ భూమి విషయమై రెండో భార్య అమ్మాయమ్మ కుమార్తె యాకలక్ష్మి 2020లో తుంగతుర్తి సివిల్ కోర్టులో కేసు వేసింది. ఈ కేసు కోర్టులో ఉండగానే పిట్టల అంజయ్య 12 ఎకరాల భూమిని ఎకరానికి రూ.20 లక్షల చొప్పున ఓ రైస్ మిల్లర్‌కు విక్రయించాడు. కాగా తన భూమిని నువ్వు ఎలా పట్టా మార్పిడి చేసుకుంటావని పిట్టల అంజయ్య కుటుంబసభ్యులతో పాటు కొనుగోలుదారులతో వెలుగు అంజయ్య పలుమార్లు ఘర్షణ పడ్డాడు.


అంజయ్య (ఫైల్)

మామిడి తోటకు వెళ్తున్నానని చెప్పి..

వెలుగు అంజయ్య ఈ నెల 16న ఉదయం 11గంటలకు మామిడి తోటకని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాలేదు. దీంతో మరుసటి రోజు ఉదయం అతని రెండో భార్య అమ్మాయమ్మ.. తెలిసిన వారి ద్వారా వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని హన్మకొండలోని నయీంనగర్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న తన కూతురు యాకలక్ష్మికి 18వ తేదీ ఫోన్ ద్వారా తెలియజేసింది. దీంతో యాకలక్ష్మి వెంటనే తోట కాపలాదారుడికి ఫోన్ చేయగా కలవలేదు. కాగా వెలుగు అంజయ్య మామిడి తోటలోనే ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడని అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు కాపలాదారుడు వుంగయ్య.. అమ్మాయమ్మ ఇంటికి వెళ్లి చెప్పాడు. వెంటనే అమ్మాయమ్మ ఇంటి చుట్టుపక్కల వారితో కలిసి మామిడి తోటకు వెళ్లి చూడగా అంజయ్య ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశాం : సీఐ నాగార్జున

వెలుగు అంజయ్య మృతిపై ఆయన కూతురు యాకలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తుంగతుర్తి సీఐ నాగార్జున తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. హత్య అని తేలితే నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కొట్టి.. ఉరివేసి చంపారు: యాకలక్ష్మి, మృతుడు అంజయ్య కూతురు



తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతుడు వెలుగు అంజయ్య కూతురు యాక లక్ష్మి 19వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. 12 ఎకరాల భూవివాదంపై 2020లో తుంగతుర్తి కోర్టు లో కేసు వేసినట్లు తెలిపారు. ఈ కేసు కోర్టులో నడుస్తుండగానే పిట్టల అంజయ్య, జంగిలి జగన్నాథం, జంగిలి సురేష్, ఇమ్మడి సోమనర్సయ్య, మడ్డి కృష్ణమూర్తి, కొల్లూరి లింగయ్య, పొదిల సుధాకర్‌లు తన తండ్రిని చంపుతామని బెదిరించారని.. ఈ విషయమై ఏడాది క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఆస్తి విషయంలో లొంగకపోవడం వల్లే వారందరూ కలిసి తన తండ్రిని కొట్టి చంపి, ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి ఉరి వేసుకునేంత పిరికివాడు కాదని అన్నారు. తన తండ్రిని చంపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిరేకల్ అభివృద్ధే చిరుమర్తి ధ్యేయం


ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నార్కట్‌పల్లి: నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అహర్నిశలు పనిచేస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలో రూ.16 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు గురువారం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి వందల కోట్ల నిధులు మంజూరు చేయించుకుంటున్న ఘనత ఎమ్మెల్యేకి చిరుమర్తికే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి తనతో పోటీ పడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అధి క నిధులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నాడని అన్నారు. త్వరలో బ్రాహ్మణ వెల్లంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరి ష్కారం కోసం పనిచేస్తున్న చిరుమర్తి లింగయ్యను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరా రు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. నార్కట్‌పల్లిలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.16 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలో బ్రాహ్మణ వెల్లంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులు పూర్తి చేయించి సీఎం కేసీఆర్‌తో ప్రారంభించనున్నట్లు పే ర్కొన్నారు. ఈ నెల 25న గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా పండుగ నిర్వహించాలని, ప్రతి మండలంలో సుమారు 600 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీలు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జ్యోతి బాలరామ్, సునీత, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, దుబ్బాక పావని శ్రీధర్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు దూదిమెట్ల స్రవంతి, యానాల మాధవీఅశోక్‌రెడ్డి, మల్ల బాలకృష్ణ, గోసుల భద్రాచలం, మేడి పుష్పలతాశంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, దోసపాటి విష్ణు, ప్రజ్ఞాపురం రామకృష్ణ, వెంకటయ్య, ఆర్‌ఎండబ్ల్యూఎస్ ఈఈ నర్సింహ, ఈఈ నరేందర్, డీఈ బేగ్, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

రేషన్ షాపులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- స్టాక్ అధికంగా ఉండడంతో డీలర్‌పై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని 13వ రేషన్ షాపులో గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. షాపులో ఉండాల్సిన స్టాక్ కంటే అదనంగా 10.74 క్వింటాళ్ల బియ్యం ఉండటంతో డీలర్ బడుగుల లింగయ్యపై అధికారులు కేసు నమోదు చేసి బియ్యాన్ని 14వ రేషన్ షాపు డీలర్ బంటు లక్ష్మయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి రేషన్ కార్డు హోల్డర్‌కు తప్పనిసరిగా బియ్యం ఇవ్వాలన్నారు. బియ్యం షాపునకు వచ్చిన విషయాన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ మహేష్, ఎస్‌ఐ గౌస్, వెంకటరెడ్డి తదితరులున్నారు.


స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పుస్తెలతాడు చోరీ

వలిగొండ: కుటుంబ సభ్యులతో కలిసి మేడపై నిద్రిస్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన మండలంలోని చిత్తాపురంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తాపురం గ్రామానికి చెందిన కొత్త అఖిల కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి మేడపైన నిద్రిస్తుండగా తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని పుస్తెలతాడును బలంగా లాగుతుండగా, ఆమెకు మెలకువ వచ్చి ప్రతిఘటించింది. ఈ క్రమంలో పుస్తెలతాడు తెగి రెండు పుస్తెలు అక్కడే పడిపోగా, మిగిలిన మూడున్నర తులాల పుస్తెలతాడును దుండగుడు అపహరించుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ఎస్‌ఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

మునగాల: తనకు న్యాయం చేయాలంటూ మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొక్కిరేణి ఎంపీటీసీ సభ్యుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల సంఘం కార్యాలయంలో మునగాల ఎస్‌ఐ పి. లోకేష్ తనపై అకారణంగా దాడి చేసి గాయపర్చాడని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 14న తిమ్మారెడ్డిగూడెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో పాటు తాను కూడా హాజరయ్యాయయని, తనను ప్రొటోకాల్ ప్రకారం స్టేజీ మీదకు పిలవకపోవడంతో అక్కడే ఉన్న ఎస్సీ కమ్యూనిటీ వారిని సంప్రదిస్తుండగా ఎస్‌ఐ లోకేష్ కల్పించుకొని తన చొక్కా కాలర్ పట్టుకొని పక్కకు నెట్టివేసి చేయి చేసుకున్నాడని అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తుండగా తనపై చేయి చేసుకోవడంతో ముఖంపై గాయాలయ్యాయన్నారు. ఈ ఘటనపై మరుసటి రోజు సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కానీ వారం రోజులు గడిచినా ఎస్‌ఐ చర్యలు తీసుకోకపోగా, తిరిగి తన పైనే అక్రమ కేసు బనాయించి ఎస్‌ఐ మానసికంగా వేధిస్తున్నాడని వాపోయారు. దీంతో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించి ఎస్‌ఐ లోకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.


ఫిర్యాదు కాపీ చూపిస్తున్న ఎంపీటీసీ

లోన్లు ఇప్పిస్తామని మోసం.. కేసు నమోదు

హుజూర్‌నగర్: బ్యాంక్ లోన్లు ఇప్పిస్తానని అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. దేవరకొండకు చెందిన గంపల సుజన్‌కుమార్ కొంతకాలంగా హుజూర్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. తాను రంగారెడ్డి జిల్లాలో ఎస్‌బీ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నానని పలువురితో నమ్మబలికాడు. తక్కువ వడ్డీకి ఎంఎస్‌ఎంఈ లోన్‌లు ఇప్పిస్తానని చెప్పి, సుమారు 60మంది నుంచి డాక్యుమెంట్ చార్జీల నిమిత్తం ఒక్కొక్కరి వద్ద రూ.30వేల నుంచి రూ.80వేల వరకు వసూలు చేశాడు. కానీ లోన్లు ఇప్పించకపోవడంతో గట్టిగా అడిగేసరికి కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి రాత్రే అద్దె ఇల్లు ఖాళీ చేసి పారిపోయాడు. బాధితుడు గొట్టిముక్కల అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుజన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

రాజాపేట: తాను బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరించి ఇతరులకు తన భూమిని పొతీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన దిడ్డిగ చంద్రయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. తాను బతికుండగానే 7 ఏప్రిల్ 1985లో మృతిచెందినట్లుగా 27 ఆగస్టు 2022న అప్పటి రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారని, అంతేకాకుండా తనకు సంబంధించిన వారసులని గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన భూమిని పొతి చేశారని అన్నాడు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో గురువారం పోలీసులను ఆశ్రయించి రెవెన్యూ అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.


రాజాపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దిడ్డిగ చంద్రయ్య

రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి మూడు నెలల జైలు

కేతేపల్లి: లారీని అతివేగంగా నడిపి విధుల్లో ఉన్న ఎస్‌ఐని ఢీకొట్టి అతడి మృతికి కారణమైన నిందితునికి 3నెలల జైలుశిక్ష విధిస్తూ నకిరేకల్ జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు చెప్పినట్లు నల్లగొండ ఎస్పీ అపూర్వరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన రాయుడు అప్పారావు 2013 అక్టోబర్ 10న ఆయిల్ ట్యాంకర్ నడుపుకుంటూ విజయవాడ నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల జంక్షన్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాములునాయక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎస్‌ఐ తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. ఈ మేరకు అప్పటి కేతేపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ నిందితుడిపై కేసు నమోదు చేసి అప్పటి నకిరేకల్ సీఐ రాములునాయక్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు తది విచారణలో భాగంగా సాక్షాధారాలు పరిశీలించి అతివేగంగా వాహనాన్ని నడిపి ఎస్‌ఐ మృతికి కారణమైన నిందితుడు అప్పారావుకు మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ నకిరేకల్ జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ కావ్య తీర్పు చెప్పినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాములునాయక్, అప్పటి ఎస్‌ఐ శ్రీనివాస్, ప్రస్తుత ఎస్‌ఐ అనిల్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కిషోర్‌బాబులను ఎస్పీ అభినందించారు.

అబార్షన్‌లు చేస్తున్న ప్రైవేట్ వైద్య సిబ్బందిపై కేసు

నల్లగొండ క్రైం: పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల విజయేందర్‌రెడ్డి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అబార్షన్‌లు చేస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడు కత్తి కనకాల్ రెడ్డి, కత్తి విజయేందర్‌రెడ్డి, బొల్లెపల్లి హనుమంతుపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ వన్ టౌన్ సీఐ తెలిపారు. గర్భంలోనే లింగనిర్ధారణ పరీక్షలు చేసి అబార్షన్లు చేస్తున్నట్లు సఖి సెంటర్ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనాల వేలంతో రూ.7.21 లక్షల ఆదాయం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం ద్వారా రూ.7.21 లక్షల ఆదాయం వచ్చినట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం వాహనాలకు వేలం నిర్వహించారు. మొత్తం 30 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.6.11 లక్షలు, జీఎస్టీ ద్వారా రూ.1.10 లక్షలు ఆదాయం లభించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐలు వెంకన్న, సతీష్‌రెడ్డి, దివ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డి లోడ్ డీసీఎం దగ్ధం

పెద్దవూర: గడ్డి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం దగ్ధమైన సంఘటన మండలంలోని ఏనేమీదిగూడెం గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏనేమీదిగూడెం గ్రామ సమీపంలోని వరి పొలాల్లో వరికోత మిషన్‌తో కోసిన గడ్డిని సంతోష్‌రెడ్డి అనే రైతు కట్టలుగా కట్టి డీసీఎంలో ఇంటికి తరలిస్తున్నాడు. డీసీఎం గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలు గడ్డి కట్టలకు తాకడంతో నిప్పంటుకుని దగ్ధమైంది.

ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడి గది ముందు, స్టాఫ్‌రూం ముందు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కుంకుమ, పసుపు చల్లి వాటిపై కోడి గుడ్లు, నిమ్మకాయలు ఉంచారు. గురువారం ఉదయం పాఠశాల తెరిచే సమయానికి ఉపాధ్యాయులు రావడంతో గదుల ముందు వాటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకుని వాటిని తీసివేయించారు. పాఠశాలలో ఇలా జరగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కాగా ఇది ఆకతాయిలు చేసిన పనేనని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ అన్నారు.


భట్టుగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో గదుల ముందు కుంకుమ, పసుపు, కోడిగుడ్లు, నిమ్మకాయలు

వ్యర్థాల ఫ్యాక్టరీ తరలించాలని రైతుల ఆందోళన

చింతపల్లి: మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పశువులు, కోళ్ల వ్యర్థాల డంపింగ్ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ గురువారం చుట్టుపక్కల పొలాల రైతులు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ పొలాల సమీపంలో పశువుల, కోళ్ల వ్యర్థాల డంపింగ్ ఫ్యాక్టరీ నెలకొల్పడంతో దుర్గంధం వస్తుందని వాపోయారు. డంపింగ్ అయిన వ్యర్థాలను కంటైనర్ల ద్వారా రాత్రి సమయాల్లో తరలిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తప్పుడు ధ్రువపత్రాలతో భూమి రిజిస్ట్రేషన్

- నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష

చివ్వెంల (సూర్యాపేట): నకిలీ ధ్రువపత్రాలతో, సంతకాలు ఫోర్జరీ చేసి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురు వ్యక్తులకు ఒకొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి శ్రీకాంత్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. చివ్వెంల మండల కుడకుడ గ్రామానికి చెందిన ముప్పాని కమలమ్మకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 110లో మూడెకరాల భూమి ఉంది. ఈ భూమి ప్రభుత్వం ఇచ్చింది కావడంతో కమలమ్మ కుటుంబం సాగు చేసుకుని జీవించడానికి లావని పట్టా మంజూరు చేశారు. దీంతో ఈ భూమిని ఇతరులకు అమ్మడానికి, రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం లేనందున, తన అవసరం నిమిత్తం కమలమ్మ కుటుంబ సభ్యులు సూర్యాపేటకు చెందిన సయ్యద్ సలీం వద్ద భూమి కాగితాలు తనఖా పెట్టి కొంత నగదు తీసుకున్నారు. కాగా సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌కు చెందిన తుక్కాని శేఖర్‌రెడ్డి, అతడి భార్య తుక్కాని సరిత, ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలకు చెందిన అతడి అత్త బాణాల శోభారాణి అలియాస్ శోభ కలిసి కమలమ్మ ఆ భూమిని తమకు అమ్మినట్లుగా తప్పుడు ధ్రువపత్రాలు తయారుచేశారు. పహాణీ, టైటిల్ డీడ్‌ను సర్వే నంబర్ 110 స్థానంలో 118 వేసి, కమలమ్మ ఫొటోకు బదులుగా శోభారాణి ఫొటోను అంటించి, కమలమ్మ సంతకాన్ని ఫోర్జరీ చేసి, భార్య సరిత పేరున తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో బాధితురాలు సూర్యాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, ముగ్గురుపై కేసు నమోదు చేశారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ బి. హేమలత నిందితులకు ఒకొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ ప్రతాప్ సహకరించారు.

ఒడిశా వలస కార్మికులపై దాడి

- ట్విట్టర్ ద్వారా వెలుగులోకి వచ్చిన సంఘటన
- కలెక్టర్ ఆదేశాలతో అధికారుల విచారణ
- తమకు ప్రాణహాని ఉందని, సొంతూరికి వెళ్లిపోతామని కార్మికుల ఆవేదన
- ఇటుక బట్టీల యజమానిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి సమీపంలో గల పీవీసీ ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిశా వలస కార్మికులపై దాడి చేసిన యజమానిపై కేసు నమోదయ్యింది. వివరాలు.. పీవీసీ ఇటుక బట్టీలలో ఒడిశా రాష్ట్రం బలంగీర్‌కు చెందిన సుమారు 100మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం అందులో పనిచేస్తున్న జేపీ రామ్, బత్తు, సురుమత్తి, ఉపల్ బాగ్, పుష్పబాగ్, ఉత్తరకుమార్‌బాగ్, సంజయ్‌బచ్చన్ ఎవరికీ చెప్పకుండా సొంతూరికి పారిపోయారు. విషయం తెలుసుకొన్న ఇటుక బ ట్టీల యజమాని పాక వెంకటకిరణ్ తన అనుచరులను పంపించి వారిని బెంగుళూరులో పట్టుకొని అ క్కడి నుంచి తిరిగి బుధవారం ఇటుక బట్టీల వద్దకు తీసుకొచ్చాడు.

నిర్బంధించి దాడి..

ఆగ్రహించిన యజమాని వారిని నిర్బంధించి పీవీసీపైపు, వైరుతో విచక్షణారహితంగా కొట్టాడు. అందులో ఓ గర్భిణి కూడా ఉంది. తీవ్రగాయాల పాలైన కార్మికులు తాము పడుతున్న ఇబ్బందులను వీడియో తీసి ఒడిశా రాష్ట్ర లేబర్ డిపార్ట్‌మెంట్‌కు పంపించారు. ఆ వీడియో చూసిన అక్కడి అధికారులు వెంటనే తెలంగాణ ప్రభుత్వానికి జరిగిన సంఘటనపై ట్విట్టర్ ద్వారా విషయాన్ని తెలియజేశారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం..

ఈ సంఘటనపై యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించడంతో గురువారం నల్లగొండ సీఐడీ డీఎస్పీ ఎర్రా, ఇన్‌స్పెక్టర్లు నవీన్, హన్మంతరెడ్డి, భూదాన్ పోచంపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ మమత, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, భువనగిరి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మోహినొద్దీన్, పోచంపల్లి ఎస్‌ఐ సైదిరెడ్డి ఇటుక బట్టీలను సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న తోటి కార్మికులను విచారించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి తదుపరి చర్యలు తీసుకొంటామని అధికారులు తెలిపారు. గాయపడిన ఆరుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇటుక బట్టీల యజమాని వెంకటకిరణ్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వెంకటకిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

స్వస్థలానికి పంపించేందుకు ఏర్పాట్లు..

అయితే తమకు ప్రాణహాని ఉందని ఇక్కడ పనిచేయలేమని కార్మికులంతా అధికారులతో తమ గోడు వెల్లబోసుకోగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని బీబీనగర్ రైల్వేస్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి రైలులో వారి వారి స్వస్థలాలకు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.


కార్మికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు


తీవ్రంగా గాయపడిన వలస కార్మికుడు